క్లుప్తంగా

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

యలమంచిలి: అడవిపాలెం గ్రామంలోని సర్వ లక్ష్మీ ప్రధాత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ 4వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాలకొల్లుకు చెందిన మేకుల అనిల్‌కుమార్, కృష్ణవేణి దంపతులు పీటలపై కూర్చుని పూజలు నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకు గణపతి పూజ, పంచామృతాభిషేకం, సహస్ర నామ సింధూర, తమల పత్ర పూజ, నీరాజనం, మంత్ర పుష్ప వేదాశీర్వచనం ఇచ్చారు. అనంతరం 8 గంటల నుంచి 11 గంటల వరకు తూర్పు గోదావరి జిల్లా మల్లేశ్వరం వాస్తవ్యులు కోటిపల్లి నాగేశ్వరరావు భజన బృందంచే 108 హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి భక్తులకు అఖండ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం ఐదు గంటల నుంచి స్వామి వారి గ్రామోత్సవం చేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు

పెనుగొండ: శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయ హుండీని శుక్రవారం లెక్కించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జీఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. 85 రోజులకు గానూ రూ.8,49,790, అన్నదానం హుండీ లో రూ.23,019 ఆదాయం రాగా, 19 గ్రాముల బంగారం, 80 గ్రాముల వెండి వచ్చినట్లు వివరించారు. దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో హుండీని లెక్కించగా ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ కోట్ల రామకృష్ణమోహనరావు, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుతో ఉపయోగం

పెనుగొండ: ఈ పంట నమోదుతో రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం పెనుగొండ మండలంలో వడలిలో దాళ్వా 2023 ఈ పంట నమోదు చేసిన రైతుల వివరాల సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. రైతులు అభ్యంతరాలు ఉంటే శనివారమే సరి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ భాల నాగేశ్వరమ్మ, సర్పంచ్ కాసాని విజయలక్ష్మి, ఎంపీటీసీలు రెడ్డి గణేశ్వరరావు, చిటికెన దుర్గాభవానీ, మండల వ్యవసాయాధికారి పి స్పందన, ఇరగవరం మండల వ్యవసాయాధికారి వై రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

వికలాంగులకు బస్సు, రైల్వే పాసుల పంపిణీ

పెనుగొండ: వికలాంగులకు ప్రభుత్వం అందిస్తున్న బస్సు, రైల్వే పాసుల సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సిద్ధాంతం సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి) అన్నారు. శుక్రవారం 12 మందికి బస్సు పాస్‌లు, 13 మందికి రైల్వే పాసులు అందించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి కె.వెంకటాద్రి, నరసాపురం ఆర్టీసీ డీపో అసిస్టెంట్ మేనేజరు పీతల రవీంద్రబాబు, ధనలక్ష్మీ పాల్గొన్నారు.

గుండెపోటుపై విద్యార్థులకు అవగాహన

పెనుగొండ: సిద్ధాంతంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 108 సిబ్బంది ఆధ్వర్యంలో గుండెపోటుకు గురైన వ్యక్తికి సకాలంలో అందించాల్సిన ప్రథమ చికిత్స పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. 108 జెడ్ఎం గణేష్ ఆదేశాలతో విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు 108 సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కేఎస్ రామచంద్రమూర్తి, 108 సూపర్‌వైజర్ దాసరి రాజు, ఎం.ఆనంద్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఆచంటేశ్వరునికి రూ.4 లక్షల విరాళం

పెనుగొండ: ఆచంటలోని ఆచంటేశ్వరుని ఆలయానికి కొత్తపేటకు చెందిన బొక్కా లోకేష్ దేవస్థానం అభివృద్ధి నిమిత్తం రూ.4 లక్షలు విరాళంగా అందించారు. ఇటీవల జరిగిన మహా శివరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వహణకు సహకరించినందున శుక్రవారం విరాళాన్ని అందించారు. దేవస్థానం ఈఓ రామచంద్రకుమార్, ఆలయ చైర్మన్ నెక్కంటి రామలింగేశ్వరరావు, సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ పాల్గొన్నారు.

సంచార పశు వాహనాలతో పశువులకు పునర్జన్మ

- మారుమూల ప్రాంతాలకు వైద్యసేవలు విస్తరణ
- పాడి రైతులకు మరింత ప్రయోజనం



పాలకొల్లు నియోజవర్గంలో అందుబాటులో ఉన్న పశు సంచార వైద్య వాహనం


శివదేవునిచిక్కాలలో గేదెకు వైద్య సేవలందిస్తున్న వెటర్నరీ వైద్య బృందం

పాలకొల్లు అర్బన్: తొలి చూలి దేశీ వాలీ ఆవు. గర్భం మెలితిరిగింది. దూడ సైజు కూడా పెరిగింది. దీంతో ప్రసవ వేదనతో బాధపడుతోంది. దగ్గులూరు పశువైద్యాధికారి డా. ప్రసాద్ ఆవు పరిస్థితి గమనించారు. ఆలస్యం చేస్తే ఆవుకి, దూడకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని గమనించారు. తక్షణమే 1962కి సమాచారం ఇచ్చారు. ఇంకేముంది రయ్ రయ్ మంటూ డా.వైఎస్సార్ సంచార పశు సంచార వాహనం ప్రసవ వేదనతో బాధపడుతున్న పాలకొల్లు మండలం తిల్లపూడిలోని రైతు దాసరి ఏసురాజు ఆవు వద్దకు చేరింది. పరిస్థితి గమనించి తక్షణం మెరుగైన వైద్యం కోసం తణుకు పశువుల ఆసుపత్రికి ఆ వాహనంలో తరలించారు. గర్భంలో ఆవుదూడకి తాడు కట్టి జాగ్రత్తగా బయటకు తీశారు. దీంతో ఆవు, దూడ క్షేమంగా ఉన్నాయి. గతంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు సకాలంలో వైద్య సేవలు అందక పశువులు మృత్యువాత పడేవి. దీంతో రైతు ఆర్థికంగా ఎంతో నష్టపోయేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన మేరకు రైతుల ప్రయోజనం కోసం ఏర్పాటు చేసిన డా.వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలు పశువులకు సంజీవినిలా పనిచేస్తున్నాయి.

రైతుల మేలు కోరి..

పశువులను సాకడం అంటే ఖర్చుతో కూడుకున్న పని. మేత ఖర్చులు పెరిగిపోయాయి. పశుగ్రాసం లభించడం లేదు. పచ్చగడ్డి, ఉలవలు, ఇతర గ్రాసాలన్నీ ధరలు పెరిగాయి. ఈ పరిస్థితుల్లో పశువులకు ఏదైనా అనారోగ్యంకానీ, లేదా ప్రమాదంకానీ, పాము కరచిగానీ చనిపోతే రైతు ఆర్థికంగా నష్టపోతున్నారు. జాతీయ వ్యవసాయ కమిషన్-1976 సిఫార్సుమేరకు ప్రతీ 5000 పశువులకు ఒక వెటర్నరీ వైద్యుడు ఉండాలని సూచించింది. గతేడాది మే 19న డా. వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించారు. ఈ సంచార వాహనంలో ఒక వెటర్నీ వైద్యుడు, ఒక వెటర్నరీ అసిస్టెంట్, ఒక డ్రైవర్‌ని ఏర్పాటు చేశారు. దీంతో పాటు వాహనంలో పశువులను పరీక్షించడానికి మైక్రోస్కోప్ పరికరాన్ని ఏర్పాటు చేశారు. అలాగే యాంటీబయోటిక్స్, పెయిన్ కిల్లర్, సెలైన్స్, ఆయింట్‌మెంట్లు, మందు బిళ్లలు, అందుబాటులో ఉంచారు. ప్రతీ నియోజకవర్గంలో రెండు వాహనాలను ఏర్పాటు చేశారు. ట్రోల్ ఫ్రీ నెం.1962కి ఫోన్ చేసిన వెంటనే సమీపంలోని పశు సంచారవాహన వెటర్నరీ వైద్యుడికి సమాచారం అందుతుంది. ఆ సమయానికి ఆ వాహనం అందుబాటులో లేకపోతే దగ్గరలోని పశుసంచార వాహన వెటర్నరీ వైద్యుడిని అప్రమత్తం చేసి పశువులకు వైద్య సేవలందిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సేవలను రైతులు వినియోగించుకుని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ విధానం పశువులకు అపర సంజీవినిలా మేలు చేస్తోందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అత్యవసర వైద్య సేవలు పొందిన పశువులు

పాలకొల్లు మండలం	145
పాలకొల్లు పట్టణం	110
యలమంచిలి	147
పోడూరు	35

ఆవు, దూడలను క్షేమంగా అప్పగించారు



ప్రాథమిక పరీక్షలో ఆవు బతకడం కష్టమన్నారు. వాహనంలో తణుకు తీసుకు వెళ్లారు. అక్కడ వైద్యులు సుమారు 3 గంటలు వైద్యం చేసి తల్లి ఆవుని, దూడను ప్రాణాలకు మాకు అప్పగించారు. తల్లి ఆవు చిన్న దూడ దగ్గర నుంచి పెంచాం. మాకు దక్కదనుకున్నాం. కానీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంచార పశు వాహనం ద్వారా ప్రాణాలు నిలిచాయి.

– దాసరి ఏసురాజు, రైతు, తిల్లపూడి

చెరువు తవ్వకం పనుల పరిశీలన

మొగల్తూరు: జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా అమృత్ సరోవర్ కార్యక్రమంలో చేపట్టిన తవ్వకం పనులను శుక్రవారం జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ పరిశీలించారు. ఈ పథకంలో మండలంలోని ఐదు గ్రామాల్లో సుమారు రూ.12.67 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. చెరువు పూడికతీత పనులతో పాటు గట్టు వెంబడి ఉన్న పిచ్చి మొక్కలు తొలగించడం, మొక్కలు నాటడం వాకింగ్ ట్రాక్‌గా అభివృద్ధి చేయడం తదితర పనులు చేపడుతున్నారు. ఈ పనులను జెడ్పీటీసీ సభ్యురాలు తిరుమాని బాపూజీ పరిశీలించి కూలీలతో పాటు ఆయన శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు తిరుమాని శివప్రసాద్, కొల్లాటి రాంబాబు, మురళీ, ఎంపీడీఓ ఆర్‌సీ ఆనంద్ కుమార్, ఏపీఓ వై.శ్రీనివాస్, ఈఓఆర్డీ నవీన్ కిరణ్, వార్డు సభ్యుడు కొండా ఆదాము తదితరులు పాల్గొన్నారు.


మొగల్తూరులో చెరువు తవ్వకం పనుల్లో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు బాపూజి

కాలినడకన చిన వెంకన్న దర్శనానికి..

పెనుమంట్ర: వనంపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంనుంచి ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్యదర్శనానికి శుక్రవారం కాలినడకన భక్తులు బయలుదేరారు. వీరికి మార్టేరు ఎంపీటీసీ సభ్యురాలు కర్రి అనురాధ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో పాదయాత్ర ఆర్గనైజర్లు తోలేటి రాంబాబు, గాదె రాంబాబు, జక్కం చినబాబులు, వెలగల శ్రీ కృష్ణభగవాన్‌రెడ్డి, కర్రి జోగిరెడ్డి పాల్గొన్నారు.


కాలినడకన ద్వారకాతిరుమలకు వెళుతున్న భక్తులు

ఎంపీటీసీ సభ్యులకు అందుబాటులో ఉంటా

ఎమ్మెల్సీ, జెడ్పీ ఛైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: పార్టీలకతీతంగా తన విజయానికి సహకరించిన ఎంపీటీసీలకు ఏ అవసరంవచ్చినా ఫోన్ చేస్తే స్పందించి వారి సమస్యలు పరిష్కరిస్తానని జెడ్పీ ఛైర్మన్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ హామీ ఇచ్చారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీగా ఎన్నికైన జెడ్పీ ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌ను ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు గజమాలతో సత్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత మూడున్నర సంవత్సరాలుగా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్న తనకు డీసీసీబీ ఛైర్మన్, జెడ్పీ ఛైర్మన్ పదవులు లభించడానికి సహకరించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనం రూ.15 వేలు పెంచడానికి ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అసెంబ్లీ దృష్టికి తీసుకువెళ్లాలని ప్రతిపక్షనేత శాగా సత్యనారాయణ శ్రీనివాస్‌ని అభినందిస్తూ చెప్పారు. అంతకుముందు మండల స్థాయిలో అమలు జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరుపై ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఎంపీడీఓ సంగాని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సమస్యలపై చర్చించే అవకాశం లేదనడంతో మండల పరిషత్ ప్రతిపక్ష నేత శాగా సత్యనారాయణ స్పందిస్తూ అలాంటప్పుడు సర్వసభ్య సమావేశం ఎందుకు ఏర్పాటు చేశారు? అని ప్రశ్నించారు. వైస్ ఎంపీపీలు పడవల సునీల్ బాబు, యన్నాబత్తుల నాగేశ్వరరావు, కోఆప్షన్ సభ్యుడు తండా ఇస్సాక్‌రాజు, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు గుమ్మాపు పెద్దిరాజు, సర్పంచ్ కెల్లా సింహాచలం, ఎంపీటీసీ సభ్యులు చింతపల్లి సాయిబాబా, పెదపాటి వెంకటరత్నం, మేడిది స్వర్ణ, యాండ్ర లక్ష్మీశైలజ, మామిడిశెట్టి మంగతాయారు, దొడ్డి ధనలక్ష్మి, ఆకుల ధనలక్ష్మి, గెడ్డం కుటుంబరావు, ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు, ఐకేపీ ఏపీఎం కలిగితి జ్యోతిరాణి పాల్గొన్నారు.


సమావేశంలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌ని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

పట్టణ సమగ్ర అభివృద్ధి దిశగా అడుగులు


బర్రి శ్రీవెంకటరమణ

నరసాపురం: పట్టణ సమగ్ర అభివృద్ధిదిశగా అడుగులు వేస్తున్నామని నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. చైర్‌పర్సన్‌గా ఎన్నికై శుక్రవారం నాటికి రెండేళ్లు పూర్తి చేసుకున్న ఆమె విలేకరులతో మాట్లాడుతూ మత్స్యకార మహిళ అయిన తనను నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు పంపించారని చెప్పారు. నరసాపురంలో మత్స్యకార మహిళకు చైర్‌పర్సన్‌గా తొలిసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం ఇచ్చారని చెప్పారు. ప్రస్తుతం వివిధ వార్డుల్లో రూ.33 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. అలాగే ప్రభుత్వ ప్రత్యేక నిధులతో చేపడుతున్న వశిష్ట వంతెన లాంటి భారీ ప్రాజెక్టులు పట్టణానికి సంబందించిన వేనని వివరించారు. ప్రభుత్వ సహకారంతో మొత్తంగా రూ.734కోట్ల అభివృద్ధి పనులు పట్టణంలో సాగుతున్నాయని చెప్పారు. స్వచ్ఛ, హరిత పట్టణానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి పనిచేస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసే దిశగా ప్రయత్నం కొనసాగుతుందని వివరించారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

నరసాపురం: నరసాపురం డిపోనుంచి అరుణాచల యాత్రకు ప్రత్యేక బస్సులు తిప్పుతున్నట్టు డిపో మేనేజర్ సుబ్బన్నరెడ్డి చెప్పారు. ఏప్రిల్ నెల 4, 7, మే నెల 3న, 6న, జూన్ నెల 2న, 5న సూపర్ లగ్జరీ బస్సులు శ్రీ కాళహస్తి, కాణిపాకం, శ్రీపురం మీదుగా అరుణాచలం వెళ్తాయని చెప్పారు. బయలుదేరిన బస్సు 3రోజుల తరువాత తిరిగి చేరుకుంటుందని వివరించారు. రాత్రి 7గంటలకు బస్టాండ్‌నుంచి బయలుదేరుతాయని చెప్పారు. చార్జీ రూ.2600లుగా నిర్ణయించినట్టు చెప్పారు. రిజర్వేషన్ సౌకర్యం ఉందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాలమర్రులో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

పాలకొల్లు అర్బన్: మండలంలోని వాలమర్రులో నూతనంగా నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ, విగ్రహ, శిఖర ప్రతిష్ఠలో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెన్మెత్స సత్య సీతారామరాజు (మునసబు) జ్ఞాపకార్థం నిర్మించిన ఈ ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. దీనిలో భాగంగా శ్రీదేవి, భూదేవి, లక్ష్మీదేవి, శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహాలకు, అలాగే ఆలయ శిఖరాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపూజ నిర్వహించారు. గ్రామానికి చెందిన 12 మంది దంపతులు ఈ పూజల్లో కూర్చుని ప్రత్యేక హోమాలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల బ్రహ్మత్వంలో పూజలు నిర్వహించారు. విగ్రహాలకు జలాదివాసం, ధాన్యాదివాసం చేశారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


వాలమర్రులో దేవతామూర్తులకు ధాన్యాదివాసం పూజలు చేస్తున్న భక్తులు

గోగులమ్మ తల్లి విగ్రహ పునః ప్రతిష్ఠ

పెనుగొండ: భీమలాపురం గ్రామ దేవత గోగులమ్మ తల్లి విగ్రహ యంత్ర పునఃప్రతిష్ఠాపన మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ముక్కామల పీఠాధిపతి శ్రీధర్ స్వామిజీ ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి ప్రతిష్ఠాపన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం గరగలతో గ్రామోత్సవం జాతర నిర్వహించారు. అనంతరం ఆలయఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

పూలపల్లిలో గ్రామోత్సవం

పాలకొల్లు అర్బన్: మండలంలోని పూలపల్లిలో గ్రామదేవతలు శ్రీ గంటాలమ్మ, శ్రీ దేవుళ్లమ్మ ఆలయ పునఃప్రతిష్ఠలో భాగంగా శుక్రవారం గ్రామోత్సవం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు–శశికళ, దాసరి విజయ్‌కుమార్ (నాని)–విజయలక్ష్మి, ఉనికెల శ్రీనివాసరావు – రామాంజలి దంపతులతో బ్రహ్మశ్రీ మానేపల్లి సత్యనారాయణ శర్మ బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ సమీపంలో నిర్మించిన యాగశాలలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. శనివారం ఉదయం 10 గంటల 18 నిమిషాలకు ఆలయ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్న అమ్మవారి ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఉనికెల నాగబాబు తెలిపారు.

అకాల వర్షాలతో రైతుల్లో ఆందోళన


మొగల్తూరులో ఈనిక దశలో ఉన్న చేలు

మొగల్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా కురుస్తున్న వర్షాలకు ఇటు వ్యవసాయ రైతులు అటు మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో మూడు రోజులు పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులకు ఏమి చేయాలో? పాలుపోవడం లేదు. మండలంలోని కేపీ పాలెం, పేరుపాలెం, మొగల్తూరు, రామన్నపాలెం, నవుడూరుగరువు ప్రాంతాల్లో సుమారు 1197 ఎకరాల్లో దాళ్వా సాగు చేపట్టగా 120 నుంచి 140 రోజుల్లో వచ్చే 1153,1121 రకం విత్తనాలను వినియోగించారు. అయితే ఇప్పుడిప్పుడే ఈనిక దశలో ఉన్న చేలు గురువారం నుంచి వర్షం పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఈనిక దశలో ఉండగా, మరి కొన్ని ప్రాంతాల్లో గింజ పాలుపోసుకునే దశలో ఉన్నాయి. ఈ పరిస్థితిల్లో భారీ వర్షాలు కురిసినా ఈదురుగాలులు వీచినా చేలు నేలవాలిపోయే అవకాశం ఉంది. మరోవైపు వాతావరణంలో మార్పులు కారణంగా అగ్గి తెగులు, దోమ వంటి సమస్యలు ఏర్పడతాయని రైతులు భావిస్తున్నారు. ప్రస్తుతానికైతే తెగుళ్ల సమస్య లేకపోయినా రాబోయే రోజుల్లో తెగుళ్ల బెడద ఏర్పడితే ఏమి చేయాలో పాలుపోక రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు మామిడి రైతుల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తుంది. మార్చి నెలలో దిగుబడికి రావల్సిన కాయలు దిగుబడికి రాకపోవడంతో పాటు పూత నిలవక, పూసిన పూత మాడిపోయి రైతులు ఆందోళనలో ఉన్నారు. భారీ వర్షాలు కురిసినా..ఈదురు గాలులు వీసినా కొద్దిపాటిగా కాసిన పిందెలు రాలిపోతాయని రైతులు వాపోతున్నారు.